# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

## రేడియో శ్రీలంకద్వారా క్రీస్తు సంఘముల కార్యక్రమములు

| | |
|---|---|
| తెలుగు | : సత్యవాణి (The Voice of Truth)<br>ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో<br>మధ్యాహ్నం 2-30 గంటలకు. |
| త మి ళ ం | : సత్యవాజి (The Way of Truth)<br>మంగళవారం - 5-30 p.m.<br>గురువారం } - 6-45 p.m.<br>ఆదివారం } |
| మ ల యా ళ ం | : The Voice of Truth<br>మంగళ, శుక్రవారాలు 3-45 p.m. |
| క న్న డ | : The Voice of Tru h<br>ఆదివారం - 1-45 p m. |
| హి ం దీ | : సత్యసుసమాచార్<br>మంగళ, గురు, శుక్రవారాలు 9-00 p.m.<br>ఆదివారం - 12-45 to 1-00 p.m. |
| ఇ ం గ్లీ షు | : The Voice of Truth<br>సోమవారం - 9-00 p.m.<br>శుక్రవారం - 7-45 p.m. |

ఈ కార్యక్రమాలను అందరు వినండి. అందరికీ విన్పించండి.

Razan Electric Press, Kakinada-1.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 10    అక్టోబరు 1989    సంచిక 3


## సంపాదకీయము

### ఇదియే రక్షణ దినము

### ( Today is the Day of Salvation )

దేవుడిచ్చిన ఆజ్ఞలు రేపటికొరకు కాదు. నిన్నటికొరకు కూడ ఆయన ఆజ్ఞలు యేమీ ఇయ్యలేదు. "నేడు మీరాయన శబ్దమును వినినయెడల...మీ హృదయములను కఠినపరచుకొనుడి" (హెబ్రీ 3:7, 8). "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపో. కా. 17:30). "అనుకూల సమయమందు నీ మొర నాలకించితిని; రక్షణ దినమందు నిన్ను ఆదుకొంటిని అని ఆయన చెప్పుచున్నాడుగదా! ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము" (2 కొరింథీ 6:2). "యెహోవా ఈ మాట సెలవిచ్చుచున్నాడు - రండి మన వివాదము తీర్చుకొందము. మీ పాపములు రక్తమువలె ఎర్రనివైనను అవి హిమమువలె తెల్లబడును" (యెషయా 1:18). "శ్రమ కలుగక

మునుపు నేను తోవ విడిచితిని. ఇప్పుడు నీ వాక్యము ననుసరించి నడుచుకొనుచున్నాను" (కీర్త 119:67).

మనము ప్రతి దినము మన సిలువనెత్తుకొని ఆయనను వెంబడించాలని, అట్లు కానియెడల ఆయన శిష్యులు కాలేమని యేసుప్రభువు బోధించాడు (లూకా 9:23). మనం ఆయనకిప్పుడు లోబడకపోతే మన హృదయాలను కఠినపరచుకొనినవారమై ఆయనను వెంబడింపక పోదుము. విధేయతకు దారితీయని విశ్వాసము వ్యర్థము. యేసు తనకు విధేయులైనవారికే నిత్యరక్షణకు కారకుడు (హెబ్రీ 5:9). రక్షించు విశ్వాసము నిలకడగలదియై యుండాలి. "నా యెదుట నీతిమంతుడైన వాడు విశ్వాసమూలముగా జీవించును గాని అతడు వెనుక తీసినయెడల అతనియందు నా ఆత్మకు సంతోషము లేదు" (హెబ్రీ 10:38). మరల దేవుని వాక్యం ఇంకా, "ప్రాణములేని శరీరము ఏలాగు మృతమో, ఆలాగే క్రియలు లేని విశ్వాసము మృతమని" చెప్పుచున్నది (యాకోబు 2:26).

పొగత్రాగే అలవాటువలన వేలకొలది ప్రజలు అమెరికా, కెనడా దేశాలలో ప్రతి సంవత్సరము మరణించుచున్నారు. ఆ యలవాటు ప్రాణం మీదికి వచ్చిన తరువాత నేనసలు దానిని ముట్టుకొనకయుంటే బావుండునని ఒకడు చెప్పవచ్చును. గాని అది అతని ప్రాణాన్ని రక్షించదు. నేను వచ్చేవారంనుండి పొగత్రాగడం మానివేస్తాననుకొంటాడు. అదికూడ అతని రక్షించదు. అతనికున్న నిరీక్షణ ఒక్కటే—అది ఇప్పుడే, ఈనాడే అతడు దాన్ని విసర్జించాలి. అట్లే విశ్వాసము, మారుమనస్సు మనకు లాభదాయకంగా యుండాలంటే, అవి ఈనాడే జరిగించబడాలి. మరి బాప్తిస్మము సంగతి యేమిటి?

భారతదేశంలో ముంచడం ఇయ్యవచ్చును గాని, శీతల దేశాలలో దానిని ఆచరించలేమని ఒకతను నాతో వాదించాడు. నా భార్య

తన 17వ యేట సువార్తను విని విశ్వసించింది. అది జనవరి నెల. మా కెనడాదేశంలో నీరంతా గడ్డకట్టి యుంటాది. అయితే వేసవి వచ్చి అదంతా కరిగేవరకు ఆమె కనిపెట్టినదా? లేదు! వారు ఐస్‌గడ్డలను కోసి నదిలో చేసిన పెద్ద కందకములో ఆమె ముంచబడింది. ఆ నీరు చల్లగాలేదా? అవును, చాల చల్లగాయున్నది. అయితే నమ్మి బాప్తిస్మము పొందినవారు రక్షించబడుదురని యేసు చెప్పాడు. ఈ మాట వేడి ప్రదేశాలకు మాత్రమేనని ఆయన చెప్పలేదు. గాని ఒకడు తన సిలువనెత్తుకొని ప్రతి దినము ఆయనను వెంబడించాలని ఆయన చెప్పాడు.

బాప్తిస్మము పొందాలనుకున్న వారి నందరిని నాలుగు మైళ్ళ దూరములోయున్న నది దగ్గరకు తీసికొనివెళ్ళడానికి డబ్బులు లేనందున వారికి బాప్తిస్మమియ్యలేక పోయానని ఒకాయన నాకు వ్రాసాడు. అతనికి విశ్వాసములేదు. బాప్తిస్మము పొందుట ప్రాముఖ్యమని యేసు తలంచాడు గనుక ఆయన దానికొరకై 60 మైళ్లు నడిచి వెళ్ళాడు. బాప్తిస్మము పొందకుండడానికి మనం వెయ్యి సాకులు చెప్పవచ్చును గాని, మన సాకులకు ఆధారము యేమీ లేదు.

పౌలు ఒక బందీగా యున్నాడు. అతడా చెరసాల అధిపతికి సువార్త బోధించాడు. ఆ యధిపతి విని విశ్వసించాడు. రాత్రి ఆ ఘడియలోనే అతడు బాప్తిస్మము పొందాడు (అపొ. కా. 16:33). ఇదొక దైవిక ఉదాహరణ. అపొస్తలుల కార్యముల గ్రంథములో మనకు అనేక ఉదాహరణలున్నాయి. సువార్త మొదటిసారిగా ప్రకటింపబడింది. సహోదరులారా మేమేమి చేతుమని అడిగి ప్రజలు తమ విశ్వాసాన్ని ఒప్పుకొన్నారు. వారు పొందిన జవాబు మీకు తెలుసు: "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" (అపొ. కా.

2:38). వారిలో ప్రతివాడు మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందాడు. ఎందుకు? పాపక్షమాపణ కొరకు. అప్పుడేమి జరిగింది? వారు సంఘముతో చేర్చబడ్డారు.

మనం నిజంగా విశ్వసించి, మారుమనస్సు పొందిన రోజుననే బాప్తిస్మము పొంది మన విశ్వాసాన్ని కనబరుచుదాం. కొన్ని మైళ్ళయినా నడిచి వెళ్ళి మన విశ్వాసాన్ని కనబరుచుదాం. మనసుంటే మార్గముంటాది, ఆ మార్గాన్ని కనుగొనే విశ్వాసం మనకున్నదా? బాప్తిస్మము పొందడానికి శిలువ నెత్తుకొనడం అవసరమైతే, దానిని ఎత్తుకొందామా?

—జె.సి. బెయిలీ.

---

## సంఘముయొక్క అన్ని కార్యక్రమాలకు నేను హాజరు కావడం అవసరమని భావించుటలేదు

## I Don't Believe it is Necessary to Attend all the Services of the Church

ఆయన పిల్లలు ఈ మాట చెప్పి, ఆచరించినప్పుడు ప్రభువుకు ఎంత బాధకలిగించే విషయమది! ఆయన రక్తంతో కొనబడినవారు ఆయనను ప్రేమించి ఆయనకు సమర్పింపబడక పోవడం విచారం. ప్రభువును తమ జీవితాలలో ముందుగా ఎంచుకొని ప్రతి సంఘ కార్యక్రమాల్లో పాల్గొనేవారి నిమిత్తం ఈ వ్యాసం వ్రాయబడలేదు. వారికికూడ కొన్నిసార్లు హాజరు కావడం అసాధ్యం అవుతుంది. పరిశుద్ధులతో సహవాసమందు పాలుపొందకుండా ఒక పనిని లేదా ఒక వ్యక్తిని ఆటంకంగా పెట్టుకొనిన వారికి ఈ వ్యాసం వ్రాయబడుచున్నది. నీ నేరాన్ని సమర్థించే ప్రయత్నంలో "సంఘముయొక్క అన్ని కార్యక్రమాలకు నేను హాజరుకావడం అవసరమని నేను భావించుటలేదు" అని చెప్పుచున్నావు.

1. ప్రిభువా, నీవు నన్ను రూపించితివి. నేను జీవించి ఆనందించు నట్లు ప్రిపంచాన్ని నడిపించుచున్నావు. ఆది. కా. 1. అనుదినము నీ ఆశీర్వాదాలను మా కనుగ్రిహించుచున్నావు (కీర్త 68:19). నీ అద్వితీయ కుమారుడు మా పాపముల నిమిత్తము మరణించునట్లు ఆయనను మా కనుగ్రిహించియున్నావు (యోహా 3:16).

కాని ప్రిభువా నిన్ను ప్రేమించలేను, ఘనపరచలేను నిన్ను ముందుగా నా జీవితంలో ప్రతిష్టించుకోలేను. లోకమందు నా పనులు నాకు, చాలా అవుసరమై యున్నవి. అవును నేను బాప్తిస్మము పొంది నప్పుడు నా పాపములు నా వెనుక నుంచుకొని నీకు నేను సమర్పించు కొంటిని.

బైబిలిట్లు చెప్పుచున్నది.

"వారు నీతిమార్గమును అనుభవపూర్వకముగా తెలిసికొని తమకు అప్పగింపబడిన పరిశుద్ధమైన ఆజ్ఞనుండి తొలగిపోవుటకంటె ఆ మార్గము అనుభవపూర్వకముగా తెలియక యుండుటయే వారికి మేలు" (2 పేతురు 2:21).

2. అన్ని కార్యక్రిమాలలోను పాల్గొని క్రీస్తు నందలి నా సోదరులను, సోదరీలను ప్రోత్సాహపరచడం నాకిష్టంలేదు.

బైబిలిట్లు చెప్పుచున్నది.

"కొందరు మానుకొనుచున్నట్టుగా సమాజముగా కూడుట మానక, ఒకని నొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచినకొలది మరి యెక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్ప వలెనని ఆలోచింతము" (హెబ్రీ 10:24, 25).

3. బలహీనుడైన నా సహోదరుని నిమిత్తము నేను ఆలోచించవలసిన పనిలేదు. అతడు నా నిమిత్తము పడిపోయినా, నిత్య శిక్షకు గురియైనాసరే నాకు లక్ష్యములేదు.

బైబిలిట్లు చెప్పుచున్నది.

"నీ సహోదరుని కష్టము కలుగజేయునది మరేదియు గాని మానివేయుట మంచిది" (రోమా 14:21).

4. నీవు నా కెందుకు అనుగ్రహించావో తెలిసినప్పటికిని నా వెలుగును ప్రకాశింపజేయుట గాని, నిన్ను మహిమ పర్చుటగాని నేను చేయను.

బైబిలిట్లు చెప్పుచున్నది.

"మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" (మత్త 5:16).

5. నేను జీవించుచున్న జీవితముయొక్క మాదిరిని బట్టి క్రీస్తు కొరకు ఆత్మలను సంపాదించే బాధ్యత నాకు లేదు.

పౌలు యిట్లు బోధించుచున్నాడు.

"నేను క్రీస్తును పోలి నడచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడచుకొనుడి" (1 కొరింధీ 11:1).

బైబిలిట్లు చెప్పుచున్నది.

"మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను, విశ్వాసులకు మాదిరిగా ఉండుము" (1 తిమోతి 4 : 12).

6. మనము కూడుకొనవలసిన సమయాలను నిర్ణయించే పెద్దల మాటకు నేను విధేయత కలిగియుండను.

బైబిలిట్లు చెప్పుచున్నది.

"మీ పైని నాయకులుగా నున్నవారు లెక్క ఒప్పచెప్పవలసిన వారివలె మీ ఆత్మలను కాయుచున్నారు. వారు దుఃఖముతో ఆ పనిచేసిన యెడల మీకు నిష్ప్రయోజనము గనుక దుఃఖముతో కాక ఆనందముతో చేయునట్లు వారి మాట విని, వారికి లోబడి యుండుడి". (హెబ్రీ 13 : 17).

7. సంఘము యొక్క అన్ని కార్యక్రమాలలో పాల్గొనుట మంచిదే. అందెట్టి దోషమును లేదు. కాని అన్నిటికి హాజరు కానవసరం లేదు.

బైబిలిట్లు చెప్పుచున్నది.

"కాబట్టి మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయని వానికి పాపము కలుగును" యాకో 4:17.

8. ఆహారము తినకుండ ఏ పనియైనను చేయనవసరము లేదు. కాని ఎక్కువ ఆత్మీయాహారము కూడ నాకవసరము లేదు.

బైబిలిట్లు చెప్పుచున్నది.

"మనుష్యుడు రొట్టె వలన మాత్రముకాదు గాని దేవుని నోట నుండి వచ్చు ప్రతిమాటవలనను జీవించును" మత్త 4:4.

"నీతి కొరకు ఆకలిదప్పులు కలవారు ధన్యులు. వారు తృప్తి పరచబడుదురు" మత్త 5:6.

9. చిన్నపిల్లలు నావైపు చూచుచు నా అడుగు జాడలలో నడచుచున్నప్పటికి నాకు లక్ష్యము లేదు.

యేసు యిట్లు సెలవిచ్చెను.

"చిన్న పిల్లలను ఆటంక పరచక వారిని నా యొద్దకు రానియ్యుడి, పరలోక రాజ్యము ఈలాంటివారిదని వారితో చెప్పి......"

(మత్త 19:14)

"నా యందు విశ్వాసముంచు ఈ చిన్న వారిలో ఒకనిని అభ్యంతరపరచు వాడెవడో, వాడు మెడకు పెద్ద తిరుగటి రాయి కట్టబడినవాడై మిక్కిలి లోతైన సముద్రములో ముంచి వేయబడుట వానికి మేలు" (మత్త 18:6).

10. స్నేహితులు కలిసినప్పుడు వారితో కలిసి యుండుట సంఘకార్యక్రిమాలకంటె ముఖ్యము.

బైబిలిట్లు చెప్పుచున్నది.

"తండ్రినైనను, తల్లినైనను నాకంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు" (మత్త 10:37).

11. ప్రభువు నిమిత్తమై నేను ఖాళీ లేకుండ ఉన్నాను. అనేక స్థలాలకు వెళ్ళి అనేక పనులు చేయాలి.

బైబిలిట్లు చెప్పుచున్నది.

"కాబట్టి ఎవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగును" (యాకోబు 4:4).

12. ఆయనను నేను నా జీవితములో ముందుగా ప్రతిష్టించుకొనకపోయినను దేవుని కృప నన్ను రక్షించుచున్నది.

"మనము సత్యమునుగూర్చి అనుభవ జ్ఞానము పొందిన తరువాత బుద్ధిపూర్వకముగా పాపము చేసిన యెడల పాపములకు బలి యికను ఉండదు గాని, న్యాయపు తీర్పునకు భయముతో ఎదురు చూచుటయు, విరోధులను దహింపబోవు తీక్షణమైన అగ్నియు నికను ఉండును." (హెబ్రీ 10:26, 27).

నీవు గమనించినట్లయితే నీ నమ్మకాలన్నిటికిని బైబిలే జవాబు నీవు దేవుని వాక్యాన్ని నమ్ముదువా? లేక నీ నమ్మకాలలోనే కొనసాగుదువా? మనము బైబిలుద్వారా తీర్పు తీర్చబడుదుమ యేసు చెప్పెను.

"నీ పూర్ణ హృదయముతోను నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునదియే. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ" (మత్త 22:37).

మన కోరికలను మనం ముందుగా ఉంచి, క్రీస్తుకొరకు ఆయన సంఘముకొరకు ఏమియు చేయకయుండిన యెడల ఈ ఆజ్ఞను మనం ఎట్లు నెరవేర్చగలము?

ఆయన ఉత్తమమైనది మనకిచ్చి, మననుండి ఉత్తమమైనది కోరుచున్నాడు. దానికొరకు ఎదురు చూచుచున్నాడు.

—డోరతి ఫిస్కస్.

---

## అన్ని సంఘములలో గల మంచివారందరు రక్షింప బడుదురా ?

## ( Will the good people of all the Churches be saved )

యాకోబు తన జీవితములో ఆఖరు 17 సం॥లు ఐగుప్తునందు గడిపెను. ఏలయనగా అతని కుమారులు అంతకు మునుపు యోసేపును ఐగుప్తీయులకు అమ్మివేసిరి. యాకోబు మరణించిన తరువాత యోసేపు సహోదరులు మిక్కిలి భయపడిరి. తండ్రి మరణించినందువలన యోసేపు తమపై పగ తీర్చుకొనునని భావించిరి. ఐగుప్తు గవర్నరుమైన యోసేపు వారి భయమునుగూర్చి విని "భయపడకుడి; నేను

దేవుని స్థానమందున్నానా? అనెను (ఆది 50:19). తీర్పుతీర్చుట దేవుని పని అను సత్యమును గ్రహించినాడు.

రోమా 14:4లో అపొస్తలుడైన పౌలు మరియొక విభిన్నమైన పరిస్థితిలో అతి ప్రాముఖ్యమైన ఈ ప్రశ్న అడుగుచున్నాడు. "పరుని సేవకునికి తీర్పు తీర్చుటకు నీవెవడవు? అతడు నిలిచియుండుటయైనను పడి యుండుటయైనను అతని సొంత యజమానుని పనియే".

యేసుక్రీస్తు కాలములో గల పరిసయ్యులు తాము అందరి కంటె అధికులము గనుక దేవునికి బదులుగా మేమే తీర్పు తీర్చుదుమని అభిప్రాయపడి అట్లే చేసెడివారు. ఇట్టి దృక్పథము సరియైనదా?

దేవుడే తీర్పరిగానుండగా మనమందరము ఆయనచే నిత్యమైన తీర్పు నొందుదుము. స్వనీతి, ఇతరులకంటె పరిశుద్ధత అను వైఖరి క్రీస్తు బోధకు వేరుగా నుండును. అయితే దేవుడు తాను తీర్పు తీర్చు విధానమును లేఖనములలో బయలుపరచినాడు.

మొదటిగా, దేవుని ప్రేమించు వారందరు నిత్యమైన రక్షణలో యుందురనునని నిర్వివాదాంశము. గొప్పదైన మొట్టమొదటి ఆజ్ఞను యేసుక్రీస్తు అనుగ్రహించాడు. "ఓ ఇశ్రాయేలూ, వినుము; నీవు నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ వివేకముతోను, నీ పూర్ణ బలముతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునది ప్రధానమైన ఆజ్ఞ" (మార్కు 12:29,30).

రెండవదిగా, ప్రభువు ఆజ్ఞలకు లోబడువారు మాత్రమే పరలోకము ను స్వతంత్రించు కొందురని మన మెరుగుదుము. "ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్త 7:21). మరల యేసు ఇట్లనెను.

"మీరునన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" (యోహా 14:15). ఆయనను ప్రేమించుచు ఆయన ఆజ్ఞలను గైకొను వారు రక్షింపబడుదురని గ్రహింపవచ్చును.

ఇతరులకు తీర్పుతీర్చ నెవనికిని అధికారము లేదు. అయితే మనకు ప్రియుడగు వ్యక్తి దేవుని చిత్తమును గ్రహింపకయు దానికి పూర్తిగా లోబడక యుండినచో అపుడు మనలో ప్రతివాడును అతడు దేవుని చిత్తమును గ్రహించి దానికి లోబడునట్లు అట్టివానికి నొక్కి చెప్పవలసిన బాధ్యత మనపై గలదు. ఉదాహరణకు క్రీస్తును నమ్మని స్నేహితు డొకడు నాకుండవచ్చును. అట్టివానికి తీర్పు తీర్చుట నీ పని కాదు ఏలయనగా ఇంతకు మునుపే దేవుడతనికి తీర్పు తీర్చినాడు. "విశ్వాసము లేకుండ దేవునికిష్టుడై యుండుట అసాధ్యము. దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా!" (హెబ్రీ 6 : 11). కావున నేను నా స్నేహితునికి తీర్పు తీర్చక అతడు దేవునియొద్దకు వచ్చు మార్గమును దేవుని కుమారుడైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచుటలో గల ప్రాధాన్యతనుగూర్చి చెప్పవలసిన బాధ్యత నాపై గలదు. మనకు తెలిసినటువంటి వ్యక్తి బాప్తిస్మమునుగూర్చి జాగ్రత్త పడనిచో అట్టివానితో కలసి మనము లేఖనమును పఠింపవలసి యున్నది; ఏలయనగా "ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (యోహా 3:5).

దేవుని యెదుట మనమందరము ఒకే స్థలమందు నిలువవలెనను దృక్పథమును మనము అందరియెడల కలిగి యుందము. దేవునిని తన తోటివారిని ప్రేమింపనివాడు రక్షింపబడడను వైఖరిని కూడ కలిగి యుందము. దేవుని ప్రేమించుట యనునది ఆయన ఆజ్ఞలకు లోబడుట

ద్వారా ప్రత్యక్షపరచబడును. ఆయనను ప్రేమింపక ఆయన ఆజ్ఞలను గైకొనకున్నచో అట్టివారు శిక్షార్హులు అని మనము చెప్పుటలేదు గాని దేవుని వాక్యమే ఆజ్ఞాపించుచున్నది. కావున తీర్పు తీర్చు అధికారమును ఆనందముతో దేవునికి వదలివేయుదము. ఏలయనగా మనము దేవుని స్థానమందున్నామా?

ఈ అంశముయొక్క ముఖ్యోద్దేశ మేదనగా, తన్ను సేవించు వారందరు ఏకముగా యుండవలెనని దేవుడు తన బోధలద్వారా బయలుపరుచుచున్నాడనునదియే. తన సంఘము ఏకముగా యుండవలెనని మాత్రమే క్రీస్తు కోరెను. అనగా ఆయన రాజ్యము విభిన్నమైన గ్రూపులుగా విభజింపరానిదని దాని భావము. ఇస్కరియోతు యూదా ఆయనను అప్పగించుటకు కొన్ని గంటలకు మునుపు యేసు యిట్లు ప్రార్థించెను. "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమై యుండవలెనని వారికొరకు మాత్రము నేను ప్రార్థించుటలేదు; వారి వాక్యమువలన నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను" (యోహా 17 : 20, 21). దురదృష్టవశాత్తు ప్రభువుయొక్క భారభరితమైన ఈ కడవరి ప్రార్థనకు క్రైస్తవులనబడు వారెవరును తమ చెవి యొగ్గుటలేదు.

సంఘము ఏకముగాను, ఐక్యముగాను యుండవలెనను అభిప్రాయమును గూర్చి క్రీస్తు ఒక్కడు మాత్రమే బోధింపలేదు గాని ఆయన అపొస్తలులుగూడ ప్రభువుయొక్క అభిప్రాయమును స్పష్టముగా తెలియజేసిరి. పౌలు ఎఫెసీయులకు యిట్లు వ్రాసినాడు. "శరీరమొక్కటే, ఆత్మయు ఒక్కటే, ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి. ప్రభువు

ఒక్కడే, విశ్వాస మొక్కటే, బాప్తిస్మ మొక్కటే, అందరికి తండ్రి యైన దేవుడు ఒక్కడే" (ఎఫెసీ 4:4-6). ఆ ఒకే శరీరము సంఘమై యున్నదని ఈ క్రింది మాటలను బట్టి విశదమగుచున్నది. "మరియు సమస్తమును ఆయన పాదములక్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము" (ఎఫెసీ 1:22, 23). ప్రభువు ఒక్కడే, పరిశుద్ధాత్మ ఒక్కడే, దేవుడు ఒక్కడే, అట్లే సంఘమనబడు శరీరము కూడ ఒక్కటే. అదే ఆయన (క్రీస్తు) సంఘము.

రమారమి 2000 సం॥లకు పూర్వము పెంతెకోస్తు దినమున స్థాపింపబడిన ప్రభువు సంఘము నేడు 308 పెద్ద శాఖలుగ విడిపోయి క్రీస్తు అనుచరులమని చెప్పుకొనుట ఎంతదుర్లభము. నూతన నిబంధన ఏకత్వమునుగూర్చి నొక్కి బోధించుచుండగా సంఘ ఏకత్వముకంటె సంఘముల బహుత్వమే విషాదభరితమునకు బదులు వినోద భరితముగా నెంచుచున్నారు. కొందరైతే మతశాఖలను ప్రోత్సహింతురు గాని మతశాఖలకు మధ్యగల వైషమ్యములను నిరసింతురు. ఇంకను వారిట్లు వాదింతురు. "మానవులలో విద్య, ఆర్థిక, సాంస్కృతిక, సాంఘిక, మానసిక వ్యత్యాసములు గలవు. కావున వారు తమతమ స్థాయిని బట్టి తమ కనువగు సంఘములను ఎంచుకొను స్వేచ్ఛ మానవుల కుండవలెనందురు".

అయితే నూతన నిబంధనలో యిట్టి క్రొత్త బోధకు తావు లేదు. సంఘ మెట్లుండవలెనో ఆ దృశ్యమును ప్రభువు లేఖనములలో చిత్రించినాడు. కావున సంఘము మానవ ఊహలను, కోర్కెలను బట్టిగాక క్రీస్తు ఊహలను కోర్కెలను అనుసరించియే యుండవలెను. సంఘముల బహుత్వము, సిద్ధాంతముల బహుత్వము అను దృక్పథము జ్ఞానయుక్తముగా కూడ నిలువదని మనము గ్రహించవలెను. సత్యమును

గూర్చి అన్వేషించి ప్రతిఫలమును పొందు యుగములో నేడు మనమున్నాము. వేలకొలది ప్రయోగశాలలో అనేకమంది బహు ప్రయాసతో ఈ సత్యమును గూర్చి అన్వేషించుచున్నారని మనకు తెలియును. కావున నేటి మన వైజ్ఞానిక యుగములో అన్ని కోణాలనుంచి సత్యమును గూర్చిన అన్వేషణ జరుగుచున్నది. కనుగొనబడిన సత్యమును గూర్చిన పతాకము అంతర్జాతీయ స్థాయిలో ఎగురవేయు యుగములో నేడు మనము ఉన్నాము. ఇట్టి సత్యాన్వేషణ వలననే మానవుడు చంద్రునిపై కాలిడుట, కొన్ని గంటలలోనే ఖండాంతర ప్రయాణములు చేయగలుగుట, ప్రపంచ వ్యాప్తముగా రేడియో, టి.వి. టెలిఫోన్ మున్నగు కమ్యూనికేషన్ సౌకర్యములు కలిగి యుండుట, జీవన ప్రమాణమును పెంచుకొనుట మున్నగునవి చేయగలుగుట ద్వారా ఎన్నో సత్యములను అన్వేషించినాడు. అయితే సొలొమోను చెప్పినది గూడ జ్ఞాపకము చేసుకొనుము. "సత్యమును అమ్మివేయక దాని కొని యుంచుకొనుము" (సామె 23:23).

ఇదే భావముతో మనము క్రైస్తవ మతములోనికి తొంగి చూచినపుడు నేటి ఆధునిక మానవుడు సత్యముయొక్క పతాకమును ఎగురవేయుటకు బదులు క్రిందికి దింపివేసినట్లు గమనించగలము. అంతేగాక ఆ పతాక స్థానములో స్వనీతి, తన సంకల్పపు చిత్తశుద్ధి, తన అభీష్టములను నిలిపినాడు. ఒకడు ఏ మతములో యున్నను అతడు నిజాయితీ గలవాడైతే అతడు మంచివాడని తీర్పు తీర్చుచున్నాడు. అట్టివాడు వివిధములైన సిద్ధాంతములను అవలంబించుచున్నను ప్రతివాడు తన కిష్టమైన మార్గములో పరలోకమునకు ప్రయాణము చేయుచున్నాడని ఆధునిక మానవుడు తలంచుచున్నాడు. సానుభూతి, పరమత సహనము అను నీడలో మానవుడు సత్యమును అమ్మివేయుచున్నాడు. రెండు ప్లస్ రెండు, ఏడు లేదా తొమ్మిదగునను పాఠశాలలో విద్యను కొనసాగించుటకు ఏతండ్రి తన పిల్లలను అనుమతిం

చును? అట్లే భూమి గుండ్రముగాను, బల్లపరుపుగాను గాక విద్యార్థికి యిష్టమగు రీతిలోనే యుండునను పాఠశాలలో విద్యను కొనసాగింప నిచ్చునా?

సత్యము ఒకే సంగతిని గూర్చి విభిన్నముగ బోధింపదు. కావున సత్యము సంకుచితమును మానవుల ఊహాల కనుగుణముగా నుండదు. యేసుక్రీస్తు సత్యమును గూర్చి యిట్లనెను. "మీరు సత్యమును గ్రహించెదరు - అపుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8 : 32). అయితే మానవుడు నిజాయితీతో నున్నంతవరకు అతడు చేయునదంతయు సరియైనదేనను భావము ఆధునిక మానవులలో గలదు. ఈ భావమును కొందరు వ్యతిరేకింతురు. అయితే క్రైస్తవ్యములో అట్టి భావమునకు లేశమాత్రమైనను తావులేదు. అట్లే సత్యము ఎచ్చట గలదో దానిపైవు ప్రజలెల్లరు ఆకర్షిపబడుట చూడగలము. కమ్యూనిష్టు దేశముల ప్రజలు సహితము నేడు ఆకర్షితులగుట తెలిసిన విషయమే.

'బహుసంఘములు అను భావము మత విషయములలో బైబిలు యొక్క సంపూర్ణ అధికారమును త్రోసిపుచ్చుచున్నది. అట్లే వివిధములైన సిద్ధాంతములన్నియు సరియైనవేనని వాటివెంబడి పోవువారందరు తొలగిపోవుచున్నారుగదా? అపనమకస్థులైన వారి హృదయములలో నమ్మకము కలుగునట్లు అను భావముతో యేసుక్రీస్తు గెత్సెమనె వనములో ప్రార్థించినట్లు మనకు తెలియును. అనేకులు క్రైస్తవులు కావలెనని కోరుదురు. అయితే ఒకడు ఎట్లు క్రైస్తవుడు కాగలడు? దేవుని కిష్టమగు రీతిలో ఎట్లు ఆరాధింపగలడు? క్రైస్తవ జీవితము ఎట్లు జీవింపగలడు? మున్నగు ప్రశ్నలకు సరియైన జవాబులను పొందలేకపోవుచున్నాడు. ప్రభువుయొక్క ఆజ్ఞలన్నిటికి లోబడకపోయినను తాము రక్షింపబడినవారమే యను తలంపులను మతశాఖలు కలిగించు

చున్నవి. తామున్న స్థితి సరియైనదని అనేకులను ఈ శాఖలు దిగ్భ్రమము చేయుచున్నవి. విభజించి జయించుట యను అమోఘమైన సిద్ధాంతము సాతానునుండియే సంక్రమించుచున్నది. అది వాని ఆయుధమే.

గనుక అన్ని సంఘములలో గల మంచివారందరు రక్షింపబడుదురా? రక్షింపబడుదురో లేదో దేవునికి మాత్రమే తెలియును. ఈ ప్రశ్నకు దేవుడు మాత్రమే జవాబీయగలడు. అన్ని సంఘములలో గల మంచి వారందరు రక్షింపబడుదురా? ఇది ఆలోచింపవలసిన ప్రశ్నయే. మానవులందరు ఎట్లు ప్రభువు సంఘములో సభ్యులుగా నుండగలరు? ఆయన ఒకే సంఘమును స్థాపించి దాని ద్వారానే నిత్యరక్షణకు అనుగ్రహించుచున్నాడు.

మానవుడైతే క్రీస్తు శరీరమును వందలకొలది ముక్కలుగా చేసియున్నాడు. బహు సంఘములు అను సమస్యకు నిజమైన పరిష్కారమేదనగా మన ప్రభువు ఏ సంఘము కొరకు చనిపోయినాడో అ నమూనా భద్రపరచబడి యున్న నూతన నిబంధన యొద్దకు తిరిగి వచ్చుటయే.

రక్షణను మనము ఆయన సంఘములో మాత్రమే కనుగొనగలము. సమస్తమును త్యజించి నూతన నిబంధన క్రైస్తవుల మగుటలో మనము ఆసక్తిని కనుపరచవలెను. ఇది, కేవలము ఇది మాత్రమే స్థిరముగా నుండగలదు. చీకటితో నిండిన ఈ యుగములో దానిని పారద్రోలుటకు నిరీక్షణయను కిరణము ప్రసరించుట కారంభించినది. ఆ కిరణము త్వరితముగా పెద్దదగుచున్నది. అదియే నూతన నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ. బైబిలు మాట్లాడినదే మేము మాట్లాడుదుము. బైబిలు మౌనముగా నున్నచోట మౌనముగా నుందుము. మరియు మనము చేయు సమస్త మత సంబంధమగు విషయములలో "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడని" పలుకుదుము గాక.

మనలో ప్రతివాడు తన సొంత తలంపులు, మానవ విశ్వాస ప్రమాణ గ్రంథములు, సిద్ధాంతముల వన్నిటిని బయటకు నెట్టివేసి దైవావేశముతో లిఖింపబడిన గ్రంథము యొద్దకు వచ్చినచో అప్పుడు మాత్రమే యేసు అను ఒకే నాయకుని క్రింద గొప్ప సైన్యముగా నుండుట సాధ్యపడును. కాబట్టి మనలో ప్రతి వాడును రెండు వేల సంవత్సరములకు పూర్వము యేసుక్రీస్తు మనకొరకు చేసిన విజ్ఞాపనను తీవ్రమైన హృదయముతో గ్రహించి ఏకత్వమును సాధించుటకు ప్రయత్నించుదాము.

—బి. విజయకుమార్,
కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్.

---

# దేవత్వములో ఒక్కరా లేక ముగ్గురా ?

## (The Godhead - One or Three ?)

—వి. యి. హోవర్డ్.

( గత సంచిక తరువాయి )

### క్రీస్తులో దేవుడు ఒకే వ్యక్తి కాదు

దేవుడు, క్రీస్తు ఇద్దరు వ్యక్తులు అని బోధించే బైబిలు బోధకు ఒక అభ్యంతరాన్ని కొందరు లేవదీయు చున్నారు. ఏలాగనగా "క్రీస్తులో దేవుడు". "దేవత్వముయొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది" (కొలస్స 2:9) యని ప్రభువు మాట సెలవిచ్చు చున్నది. యోహాను 1 : 16 చదివినయెడల "ఆయన పరిపూర్ణతలోనుండి మన మందరము కృపవెంబడి కృపను పొందితిమి". మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా ప్రేమయందు వేరుపారి స్థిరపడి ...తగిన శక్తి గలవారు కావలెనని ప్రార్థించుచున్నాను (ఎఫెసీ 3:19).

అవును, "క్రీస్తులో దేవుడున్నాడు". కాని ఈ విషయం వారిద్దరు ఒకే వ్యక్తి యని ఋజువుపర్చుటలేదు. దేవత్వముయొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది. ఈ విషయం దేవునియొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు, వ్యక్తిత్వములు లేవని చెప్పుటలేదు. దేవునియొక్క సంపూర్ణత మనయందు నివసించుచున్నదని పౌలు చెప్పెను. అందుచేత మనం దేవుళ్ళై యున్నామా? దేవునియొక్క సర్వ పరిపూర్ణత క్రీస్తునందు నివసించుచున్నదనే మాట దేవుడు క్రీస్తు ఒకే వ్యక్తి యని ఋజువుపర్చిన యెడల, దేవునియొక్క సర్వ పరిపూర్ణత క్రైస్తవులయందు నివసించుచున్నదని పౌలు చెప్పిన మాట మనల్ని దేవునిగా చేయుచున్నది. ఈ వాదన క్రీస్తు దేవుని కుమారుడు అనే విషయాన్ని తిరస్కరించు చున్నది. మానవుని దేవునిగ చేయుచున్నది.

## కుమారుడున్నాడు – తండ్రి ఉన్నాడు

1 యోహా 2:23లో "కుమారుని ఒప్పుకొనని ప్రతివాడును తండ్రిని అంగీకరించువాడు కాదు. కుమారుని ఒప్పుకొనువాడు తండ్రిని అంగీకరించువాడు". ఈ వాక్యాన్ని బట్టి తండ్రి కుమారుడు ఒకే వ్యక్తియని చెప్పుచున్నారు. "కుమారుని ఒప్పుకొనని ప్రతివాడు తండ్రిని అంగీకరింపనివాడు" అను ఈ వాక్యాన్ని అపార్థము చేసుకొనుచున్నారు. ఈ వాక్యములో చక్కగా వివరించబడిన మాటను మరోసారి చదవండి. "కుమారుని ఒప్పుకొనువాడు తండ్రిని అంగీకరించువాడు" "తండ్రిని కూడ" (ఇది ఇంగ్లీషు బైబిలులో ఉన్నది) (father also) అను మాట ఒకటికంటె ఎక్కువ మందిని సూచించుచున్నది, "కుమారుడు" "తండ్రి కూడ" అని చెప్పుచున్నది. తండ్రి ఆయన కుమారుడా? కుమారుడు ఆయన తండ్రియా? పౌలు యిట్లు చెప్పెను. "దేవుడు... క్రీస్తునందు లోకమును తనతో సమాధాన పరచుకొనుచు ఆ సమా

ధాన వాక్యమును మాకప్పగించెను" (2 కొరిం 5:19). దీనిని బట్టి వీరిద్దరు ఒకేవ్యక్తి యని చెప్పుచున్నారు. పౌలు ఒకే వ్యక్తి యని చెప్పలేదు. క్రీస్తు మనయందు నిలిచియున్నాడని మనము క్రీస్తునందు నిలిచియున్నామని యోహా 15:4-5లో చెప్పబడెను. "నాయందు నిలిచియుండుడి. మీయందు నేనును నిలిచియుందును. ఎవడు నాయందు నిలిచియుండునో నేను ఎవనియందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును". 1యోహా 4:12-13 లో అపొస్తలు డిట్లు చెప్పుచున్నాడు. "ఏ మానవుడును దేవుని ఎప్పుడును చూచి యుండలేదు. మన మొకనినొకడు ప్రేమించిన యెడల దేవుడు మనయందు నిలిచియుండును. ఆయన ప్రేమ మనయందు సంపూర్ణమగును. దీనివలన మనము ఆయనయందు నిలచియున్నామనియు ఆయన మనయందున్నాడనియు తెలిసికొనుచున్నాము. ఏలయనగా ఆయన మనకు తన ఆత్మలో పాలు దయచేసి యున్నాడు". దేవుడు క్రీస్తునందు నిలిచియున్నాడనే వాక్యం దేవుడు క్రీస్తు ఒకే వ్యక్తి అని ఋజువు చేసినయెడల క్రీస్తు మనయందు నిలిచియుండుట అంటే మనం క్రీస్తుగా మారిపోవడమే. మనం క్రీస్తయితే మనమే దేవుడు; క్రీస్తే మానవుడు. మానవుడే దేవుడు. ఇది ఎంత వింత!

## ప్రశ్నావళి

పరిశీలన నిమిత్తం 20 ప్రశ్నలు మీా యెదుట ఉంచడానికి నేను సంతోషించుచున్నాను.

1. దేవుడు క్రీస్తు ఒకే వ్యక్తి యైనయెడల యేసు తన కుడిపార్శ్వమందు నిలిచియున్నట్లు స్తెఫను ఎట్లు చెప్పెను? "అతడు పరిశుద్ధాత్మతో నిండుకొనినవాడై ఆకాశమువైపు తేరి చూచి దేవుని మహిమను యేసు దేవుని కుడిపార్శ్వమందు నిలిచియుండుట చూచెను" (అపొకా. 7:55).

2. దేవుడు క్రీస్తు ఒకే వ్యక్తిగా ఉంటే, తండ్రికి ప్రార్థన చేయమని క్రీస్తు చెప్పినది అబద్ధమా? (మత్త 6:9).

3. దేవుడు, క్రీస్తు ఒకే వ్యక్తియైన యెడల, ఆయనను విడిచి ఆయనే వచ్చెనా? అదే సమయంలో ఆయన చేత ఆయనే పంపబడెనా? "దేవుడు మీ తండ్రియైన యెడల మీరు నన్ను ప్రేమింతురు నేను దేవుని యొద్దనుండి బయలుదేరి వచ్చియున్నాను. నా అంతట నేనే వచ్చియుండలేదు. ఆయన నన్ను పంపెను" (యోహాను 8:42).

4. యేసు దేవుడు, కుమారుడు తండ్రియైన యెడల ఇద్దరు ఒకేవ్యక్తి యైనయెడల తండ్రికి తెలిసినది ఆయనకు తెలియదా? తండ్రి ఎరిగినది నేనెరుగనని ఎందుకు చెప్పెను? కుమారుడే ఏమి చెప్పెనో వినండి. "అయితే ఆ దినమును గూర్చియు, ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగును గాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు" (మత్త 24 : 36).

5. దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్ముడు ఒకే వ్యక్తియైన యెడల మనుష్య కుమారునికి విరోధముగా మాటలాడువానికి పాపక్షమాపణ కలదు గాని పరిశుద్ధాత్మకు విరోధముగా మాటలాడువానికి పాపక్షమాపణ లేదని ఎందుకు చెప్పబడినది? "మనుష్య కుమారునికి విరోధముగా మాటలాడు వానికి పాపక్షమాపణ కలదు గాని పరిశుద్ధాత్మకు విరోధముగా మాటలాడు వానికి ఈ యుగమందైనను రాబోవు యుగమందైనను పాపక్షమాపణ లేదు" అని యేసు చెప్పెను (మత్త 12:32).

6. దేవుడు, క్రీస్తు ఒక్కరే యైన యెడల యూదులు యేసును చంపినపుడు భూమిని పరిపాలించు దేవుని చంపి మూడు దినములు ఆయనను సమాధిలో ఉంచిరా?

7. క్రీస్తు సిలువపైనుండి తండ్రీ నా ఆత్మను చేర్చుకొనుమని కోరు కొనెను. వారు ఒకే వ్యక్తి యైనయెడల, కుమారుడు సిలువపై మరణించినపుడు తండ్రికి ఎట్లు తన ఆత్మను అప్పగించగలడు? తండ్రి కుమారుడైతే కుమారుడు అత్యధికమైన బాధలో "తండ్రీ నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొను చున్నాననెను". ఆయన ఆత్మను చేర్చుకొనుటకు తండ్రి ఉన్నాడా?

8. యేసును అపొస్తలులు చూచినట్లు, దేవుని ఏ మనుష్యుడును చూడలేదని బైబిలు చెప్పుచుండగా (యోహా 1:18), దేవుడు, క్రీస్తు ఒకే వ్యక్తి ఎట్లు కాగలరు?

9. నా చిత్తము కాదు, దేవుని చిత్తమును నెరవేర్చుటకు వచ్చితినని క్రీస్తు చెప్పెను. ఒకే వ్యక్తియైతే, దేవుని చిత్తమును నెరవేర్చుటకు వచ్చితినని క్రీస్తు ఎందుకు చెప్పెను? (యోహా 4:34; 6:38, 39).

10. తనకు ఎముకలును మాంసమును ఉన్నవని క్రీస్తు చెప్పెను. "దేవుడు ఆత్మ" యని ఆయన చెప్పెను (లూకా 24:39; యోహా 4:24). ఒకేవ్యక్తియైతే దేవునికి ఎముకలును, మాంసమును కలవా?

11. 1 కొరింథీ 15:24లో క్రీస్తు తండ్రికి రాజ్యము అప్పగించునని వ్రాయబడియుండెను. రాజ్యము ఆయనకు ఆయనే అప్పగించునా?

12. దేవుడు, క్రీస్తు ఒక్కరేయైన యెడల వారు అబ్రాహాము దావీదుల కుమారుడు (మత్త 1:1). ఈ విషయం దేవుని ఆదాము కుమారునిగ జేయుచున్నది (లూకా 3:23-38). ఆదాము దేవుని చేత సృజింపబడెను.

13. దేవుడు క్రీస్తు పరిశుద్ధాత్మ ఒకే వ్యక్తి యైనయెడల క్రీస్తు దేవుని

కుమారుడు కాదు. ఆయనే ఆయన కుమారుడు (మత్త 16:16, 17). దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్ముడు ఒక్కరే యనుట క్రీస్తు దేవుని కుమారుడని తిరస్కరించుటయే. ఇదెంత అవిశ్వాసము!

14. దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్మ ఒకే వ్యక్తి అయినట్లయితే దేవునికి మానవునికి యేసు ఎట్లు మధ్యవర్తి కాగలడు? (1 తిమో 2:5). మధ్యవర్తి యనగా మధ్య నిలుచువాడు. ఇద్దరు లేక ఎక్కువ మంది మధ్య మధ్యవర్తిత్వము సాధ్యము. ఒకే వ్యక్తి యున్నట్లయితే మధ్యవర్తిత్వము ఎట్లు సాధ్యము కాగలదు? క్రీస్తు మన మధ్యవర్తి. ఆయన తండ్రియైన దేవునికి మానవునికి మధ్యవర్తి.

15. పరిశుద్ధాత్మ భూమిమీదికి వచ్చెనని బైబిలు చెప్పుచున్నది (అ.కా. 2:4). అ.కా. 2:33లో ఆయన దేవుని కుడిపార్శ్వమున నున్నట్లు వ్రాయడియున్నది. దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్మ ఒకే వ్యక్తియైనయెడల ఎప్పుడు ఆత్మ భూమిమీదకు వచ్చెను? ఎవరు దేవుని కుడిపార్శ్వమున ఉండిరి? ఎవరు దేవుడు? ఎవరు క్రీస్తు? వారిద్దరు పరలోకమందున్నట్లు నటించుచున్నారా?

16. క్రీస్తు భూమిమీద బాప్తిస్మము పొందగా దేవుడు పరలోకమందుండెను. పరిశుద్ధాత్మ పరలోకమునుండి దిగి వచ్చెను (మత్త 3:16-17). దేవత్వములో ఒకే వ్యక్తి యున్నయెడల ఇదెట్లు సాధ్యము? ఈ వాక్య భాగములో దేవత్వమునందు ముగ్గురు వ్యక్తులున్నట్లు గుర్తించవచ్చును.

17. క్రీస్తు తనకు తానే అర్పించుకొనెనా? "దేవునికి నిర్దోషిగా అర్పించుకొనిన క్రీస్తుయొక్క రక్తము...శుద్ధిచేయును" (హెబ్రీ 9 : 14).

18. దేవుడు, క్రీస్తు ఒకే వ్యక్తియైన యెడల ఆయనకంటె ఆయనే గొప్పవాడా? "తండ్రి నా కంటె గొప్పవాడు" అని ఆయన చెప్పెను (యోహా 14:28).

19. యోహా 16 : 7-14లో దేవుడు అపొస్తలులకు పరిశుద్ధాత్మను పంపునని యేసు చెప్పెను. యేసు తనను గూర్చి మాట్లాడెనా? అదే సమయంలో ఆయన పరలోకంలోను భూమిమీదనుండి పరిశుద్ధాత్మను పంపుదునని ఆయనే వాగ్దానము చేసెనా?

20. దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్మ ఒక్కరే యైనయెడల అపొస్తలులను విడిచి వెళ్ళవలసిన అవసరం ఉన్నదని యేసు వారికి చెప్పి, వారు సర్వసత్యంలోనికి నడిపించుట కొరకు ఆయనే మరల తిరిగి వచ్చెనా?

## వేర్వేరు పని – వేర్వేరు వ్యక్తులు

దేవత్వము నందలి వ్యక్తులకు వారికి సంబంధించిన వేర్వేరు పనిని బట్టి కుమారుడు పరిశుద్ధాత్మ ఈ రెండు వ్యక్తిత్వములు భూమిమీద ఒకేసారి ఉండలేదు. యోహాను యిట్లు వ్రాయుచున్నాడు. "తన యందు విశ్వాసముంచువారు పొందబోవు ఆత్మను గూర్చి ఆయన ఈ మాట చెప్పెను. యేసు ఇంకను మహిమపరచబడలేదు గనుక ఆత్మ ఇంకను అనుగ్రహింపబడి యుండలేదు" (యోహా 7 : 39). యేసు తండ్రియొద్దకు వెళ్ళిన తరువాత ఆత్మను పంపుదునని వాగ్దానము చేసెను (యోహా 16:7). కుమారుడు, పరిశుద్ధాత్మ వీరి పని వేర్వేరుగా నున్నను ఒకరికొరకు వ్యతిరేకముగ పని చేయలేదు. మానవుని యెడల దేవుని చిత్తమును నెరవేర్చుటకు తండ్రిచేత పంపబడిన ఆత్మ క్రీస్తు స్వాధీనములో నుండి పనిచేసెను. రాజ్యమును స్థాపించుటకు సత్యము ప్రకటించుటకు పరిశుద్ధాత్మ వచ్చి నడిపించే వరకూ వాటి విషయంలో ఎట్టి చర్య తీసుకొనబడలేదు. అపొస్తలులు కుమారుని ద్వారా ఆదేశింపబడిరి. "మీరు పైనుండి శక్తి పొందువరకు

పట్టణములో నిలిచి యుండుడని వారితో చెప్పెను" (లూకా 24:49). అపొ.కా. 1:4-5 నందు మీరు యెరూషలేము నుండి వెళ్ళక తండ్రి యొక్క వాగ్దానము కొరకు అనగా పరిశుద్ధాత్మ కొరకు కనిపెట్టుమని క్రీస్తు చెప్పిన మాట లూకా వ్రాసెను. [సశేషం

## మోషేకు వ్రాయడం వచ్చా ?

## ( Could Moses Write ? )

దేవుడు తెలియజేసిన మాటలను మోషే వ్రాసినట్లు బైబిలు చెప్పుచున్నది (ద్వితీ 31:9; సంఖ్యా 12; లూకా 20:37). "మరియు మోషే యెహోవా మాటలన్నిటిని వ్రాసెనని" బైబిలు విశదముగ చెప్పుచున్నది (నిర్గమ 24:4).

ఒక వంద సంవత్సరముల క్రితం బైబిలును శంకించు వారు మోషేకు ఏమి వ్రాయడం చేతకాదని చెప్పడం మొదలుపెట్టారు. మోషే జీవించిన ప్రాంతంలో ఆనాడు వ్రాయబడిన రాతిపలకలు వగయిరా పురావస్తు శాస్త్రజ్ఞులకు యేమీ దొరకలేదు (1500 B.C.) మోషే కాలానికి ప్రజలకు వ్రాయడం చేతకాదని ఈ శంకించేవారి భావన. బైబిలులోని మొదటి ఐదు పుస్తకములు మోషే తర్వాత చాలాకాలానికి మరింకెవరో వ్రాసారని వారు ఆరోపించారు. మోషే వ్రాసినట్లు బైబిలు చెప్పు మాటలు అసత్యమని వారు ప్రజలకు నచ్చ జెప్ప యత్నించారు.

అయితే 1887 లో ఈ శంకించేవారి వాదనలను తునాతున కలు చేయునట్టి అనేక రాతిపలకలు కనుగొనబడ్డాయి. మోషే తన మొదటి 40 సంవత్సరములలో ఐగుప్తులో జీవించిన స్థలమందు "టెల్ ఎల్ అమర్నా రాతిపలకలు" పురావస్తు శాస్త్రజ్ఞులకు దొరికాయి. ఈ రాతిపలకలు, వాటిమీది వ్రాతలు మొదలగునవి మోషేకంటె

700 సంవత్సరముల ముందు చేయబడ్డాయి. సర్ ఫ్రెడరిక్ కెన్యాన్ ఇట్లు చెప్పాడు : "ఒకటి మాత్రం విశదముగా యున్నది. అదేమంటే హెబ్రీయులు ఐగుప్తును విడిచేసరికి, ఆ దేశంలో వ్రాయడం అనేక శతాబ్దాలుగా విరివిగా ప్రబలియున్నది. మరియు "మోషే ఐగుప్తీయుల సకల విద్యలను అభ్యసించి యుంటే" అతడు వ్రాయడంలో కూడ ప్రవీణుడై యుండెను".

ఈ రాతిపలకలు కనుగొనబడిన నాటినుండి, శాస్త్రజ్ఞులు అంతకన్న ముందటి శతాబ్దములో నున్న పలకలను కనుగొన్నారు. మోషేకంటే అనేక వందల సంవత్సరములకు ముందునుండే వ్రాయడం ప్రబలియున్నట్లు అవి రుజువు చేయుచున్నవి. అవును, అబద్ధములాడింది బైబిలు శత్రువులు గాని బైబిలు కాదు.

—రోయిస్ ఫ్రెడరిక్

---

## రక్షణాధార బావులనుండి ఆనందము

## ( Joys from the wells of Salvation )

"కావున మీరు ఆనందపడి రక్షణాధారములైన బావులలోనుండి నీళ్ళు చేదుకొందురు" (యెషయా 12 : 3).

పాలస్తీనా వేడిగలదియై సగం యెండిపోయిన దేశము. చల్లని నీరుగల బావులు అక్కడ పవిత్రమైనవి. బావులు, ఊటలు, నదులు దేవుని ఆత్మీయ ఆశీర్వాదముల గురుతులుగా బైబిలునందు తరచు వినియోగించబడెను. యెషయా క్రైస్తవ్యమును గూర్చి చేసిన సరియగు ప్రవచనము పైన చెప్పబడినది. దివ్యప్రేరణ ప్రతి పుటలోను బయలుపరచు రీతిగా క్రైస్తవ్యము యొక్క ముఖ్యభావము దాని నుండి పొందే ఆనందమై యున్నది. "ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి" యని ఫిలిప్పీయులకు పౌలు ఒక ఆనంద పత్రికను వ్రాస్తూ తానున్న రోమా చెరసాలనుండి హెచ్చరించెను (ఫిలిప్పీ 4 : 4).

మన పూర్వీకుల ఆరాధన స్థలములు (గుడులు) తమ దేవుని యందు పట్టలేనంత సంతోషముగల వారితో నింపబడెను. ఆధునిక

మతములు ఆరాధన పద్ధతుల వలన ఆరాధననుండి మనము పొంద వలసిన ఆనందమును కోల్పోతిమని నా భావము. మానవకల్పిత పద్ధతులవలన ఆత్మీయత, భక్తితత్వము ప్రేమ మొదలగునవి కుంటు బడినవి. శాంతియుతంగా ఆరాధించుటకొరకు సమావేశమై ప్రార్థన తోను, సీయోను పాటలతోను, దైవ వాక్యోపదేశముతోను ప్రభువు బల్ల సహవాసముతోను, కానుకలిచ్చుటతోను నిండియున్న ఆనంద ముతో ఈ లోకసంబంధమైన సంతోషాలేమీ తులతూగవు. దేవుని కృపయే ఈ యాశీర్వాదములన్నీ మనకు కలుగజేసినదని గ్రహించుట ముదావహము.

త్యాగంలో అతి శ్రేష్టమైన సంతోషం లభిస్తాది. తల్లి బిడ్డలను పెంచుటలో త్యాగం చేస్తూ ఎట్లు ఆనందిస్తాదో అట్లే క్రైస్తవుని నిజమైన ఆనందము తన్ను తాను ఉపేక్షించుకొనుటలో యున్నది. దేవుని రక్షణాధార బావులనుండి నీళ్ళు చేదుకొనుచు గొప్పగా ఆనందించువాడు ధన్యుడు.

—ఫ్రెంక్ వింటర్స్.

———

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To
..............................
..............................
..............................
..............................